క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కరుణాకర్

సింహాచలం: పాడి పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు జిల్లా పశు సంవర్ధకశాఖ డివిజనల్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్ సూచించారు. పెందుర్తి మండలం చింతగట్లలోని జెర్రిపోతులపాలెం రైతుభరోసా కేంద్రంలో పశు విజ్ఞానబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కరణాకర్ రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాడి పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అలసత్వం వహించవద్దని సూచించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గొర్రెలు, మేకల్లో వచ్చే పీపీఆర్(పారుడు రోగం)నివారణ టీకాల గురించి, జంతు సంక్షేమ చట్టాలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోటనరవ పశు వైద్యశాల అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుజాత, చింతగట్ల పశువర్ధకశాఖ అసిస్టెంట్ వి.కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'పరీక్షా పే'పై చర్చ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామునాయుడు

సింహాచలం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని పెందుర్తి మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించారు. పెందుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేలా పలు పాఠశాలల్లో ఏర్పాట్లు చేశారు. పరీక్షలపై ఉన్న భయం, ఆందోళన పోగట్టడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని రామునాయుడు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక జేఎన్ ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న సంపతి శ్రీనివాసరావు(35) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు.. భార్య జ్యోతి, తల్లి వరలక్ష్మితో కలిసి 6 నెలలుగా కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే భార్యతో మనస్పర్ధలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. భార్య తనను విడిచివెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తల్లి వరలక్ష్మి ఉదయం కుమారుడిని నిద్ర లేపడానికి వెళ్లి తలుపుకొట్టినా స్పందించలేదు. స్థానికుల సహాయంతో తలుపు తీసి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడని తల్లి వరలక్ష్మి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తల వెంట్రుకలు దానం చేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. వింగ్స్ ఫర్ లైఫ్, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో స్ట్రాండ్స్ ఆఫ్ హోప్ అండ్ కరేజ్ 'హెయిర్ డొనేషన్ డ్రైవ్'పోస్టర్‌ను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వింగ్స్ ఫర్ లైఫ్ ప్రతినిధులు జ్యోతిర్మయి, రష్మీ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు సీతమ్మధారలోని నేచురల్ బ్యూటీ సెలూన్‌లో ప్రజలు స్వచ్ఛందంగా తమ జుట్టును దానం చేయవచ్చని తెలిపారు.

శారదాపీఠం.. ఆధ్యాత్మిక పరిమళం





ఆధ్యాత్మిక శోభతో శారదాపీఠం, (ఇన్‌సెట్) అమ్మవారు



స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనుబాబు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పీఠం ప్రాంగణంతో పాటు ఆయా మార్గాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. హోమాలు, ప్రత్యేక పూజలతో భక్తులు ఉప్పొంగిపోయారు. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానంద్రే సరస్వతి, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేద్ర సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సామీజీలు ఆశీస్సులు అందజేశారు. భక్తులు రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని తరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శారదాపీఠం వార్షికోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రముఖ నేపథ్యగాయకుడు నేమాని పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన భాగవత పద్యాలాపన ఆకట్టుకుంది.



ఆగమ సదస్సులో పాల్గొన్న స్వామీజీలు

సింహగిరిపై రథసప్తమి పూజలు నేడు



అప్పన్న ఆలయంలో ముస్తాబైన రాతిరథం

సింహాచలం: సింహగిరిపై శనివారం రథసప్తమి పూజలు విశేషంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం వైదిక,అధికారులు ఏర్పాట్లు చేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న పురాతన రాతిరథాన్ని ముస్తాబు చేశారు. రాతిరథంపై స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను రాతిరథంపై అధిష్టంపజేసి స్వామికి అభిషేకాలు, ఆరాధనలు, పూజలు, అరుణపారాయణ నిర్వహిస్తారు. ఉదయం 9.30గంటల నుంచి రాతిరథంపై స్వామికి నిత్య కల్యాణం, సాయంత్రం ఉత్సవమూర్తులకు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు.

శ్రీకృష్ణాపురం గోశాలలో....

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. గోశాలలో 12 అడుగుల ఎత్తున కొలువై ఉన్న సప్త అశ్వవాహనదారుడైన సూర్యనారాయణస్వామి విగ్రహం వద్ద పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి పంచామృతాభిషేకం, అరుణపారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించనున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై ఆరా

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందుతున్న తీరుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆరా తీశారు. శుక్రవారం పెందుర్తి ప్రాంతం కోలవానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పర్యటించారు. మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తుల గృహాలకు వెళ్లారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంతో పాటు 104 వాహనం ద్వారా అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు.




ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

డ్రైడే ఫ్రైడే పాటించండి

అనంతరం అదే గ్రామంలో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మంచినీటిపై మూతలు సరిగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ నివారణ పద్ధతులు,మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమారెడ్డి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు,శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఉప్పెనలా ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమం ఉప్పెనలా మారుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఎన్నో త్యాగాలకోర్చి సాధించుకున్న పరిశ్రమను పరిరక్షించుకునేందుకు ఐక్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ నిర్వహిస్తున్న ఉక్కు మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో 715వ రోజు శుక్రవారం ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇలా సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు టి.భాస్కరరావు, ఎ.అప్పారావు, ఎస్.పాపారావు, ఎస్.గోవిందు, డి.వి.రమణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేతో రైతులకు తమ భూములపై సంపూర్ణ హక్కు లభిస్తుందని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. సమగ్ర రీ సర్వే పై సబ్బవరం రెవెన్యూ పరిధిలోని రైతులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రీ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది భూములపైకి వచ్చినపుడు రైతులు తమ సాగులో ఉన్న భూముల వివరాలు కచ్చితంగా తెలియజేయాలన్నారు. ముందుగా గ్రామంలో భూములకు సంబంధించి నిజనిర్ధారణ జరుగుతుందన్నారు. రైతులు తమ సాగులో ఉన్న అసైన్‌మెంట్ ల్యాండ్స్‌ను కూడా వారి పేరున నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సబ్బవరం రెవెన్యూ పరిధిలో రైతుల సాగులో ఉన్న ఇనాం,అగ్రహారం భూములు సర్వేచేసి పట్టాలు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. సబ్బవరం మండలంలో అగ్రహారం(ఇనాం భూములు),టీడీ ఇనాం భూములు సుమారు 600 నుంచి 700 ఎకరాల వరకూ రైతుల సాగులో ఉందని, పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఉపసర్పంచ్ మండల లక్ష్మణ,మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బైలపూడి దేముడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, పల్ల తాతారావు, కొటాన అప్పారావు,గొర్లి శ్రీను,దెడ్డం పద్మావతి,ఆర్‌ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూజలో దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

నావికా దళ సిబ్బంది రక్తదాన శిబిరం

ఎంవీపీ కాలనీ: ఈస్టర్న్ నావల్ కమాండ్ ఐఎన్ఎస్ సర్కార్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకులో జరిగిన ఈ శిబిరాన్ని కమాండ్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ఆర్.ఆర్.రవి ప్రారంభించారు. అనంతరం 17 మంది మహిళలతో పాటు 163 మంది సిబ్బంది రక్తదానం చేశారు.

వేడుకగా అక్కులమ్మ తీర్థం



అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలిలో కొలువుదీరిన అక్కులమ్మ పేరంటాలు అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అక్కులమ్మ పేరంటాలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపు పరవాడ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారిని దర్శించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనన్ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తీర్థ మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన తోడ పెద్దులు, తప్పెట గుళ్లు, చిడతల భజనలు, కోలాటాలు, కోయడ్యాన్సులు ఆకట్టుకున్నాయి. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. పరవాడ పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొన్న వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు కాసు అంజిరెడ్డి, సిరపరపు రాజేష్, కె.సీతారామయ్య, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీను ఉన్నారు.

అమ్మో.. ఆ మార్గంలో ప్రయాణం!



లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో ఎగసిపడుతున్న బూడిద



బూడిదలారీల వల్ల దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన వద్ద నిలిచిపోయిన వాహనాలు

ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి

పరవాడ: లంకెలపాలెం–సబ్బవరం రహదారిలో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలు విడుదల చేస్తున్న దుమ్ము ధూళితో నరకయాతన పడుతున్నామని పలు గ్రామాల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో బూడిద లారీలు ప్రయాణిస్తున్నాయి. తడి, పొడి బూడిద రాలి బూడిదమయంగా మారిపోయింది. రోడ్డంతా బూడిద కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అధిక బరువు కలిగిన బూడిద లారీల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. బూడిదను పీల్చడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి ఆస్పత్రుల పాలవుతున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే బూడిద కారణంగా దుకాణాలు ధూళితో కమ్ముకొని తినుబండారాలు పాడై నష్టపోతున్నామని చిరువ్యాపారులు వాపోతున్నారు. మరో వైపు లారీల రాకపోకలతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిట్టవానిపాలెం–లంకెలపాలెం రహదారిలో ప్రయాణిస్తున్న బూడిద లారీల కారణంగా దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన వద్ద తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుమ్ము ధూళిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లావణ్య

అగనంపూడి: జంతువులు కూడా మనుషుల వలే ప్రాణులని, వాటిని హింసించడం నేరమని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ లావణ్య అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా అగనంపూడి వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతు సంక్షేమం, సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగరం, మఫిసల్ ప్రాంతాల్లో పశువులను రోడ్లమీద మేతకు విడిచిపెట్టడంతో అవి రోడ్డు మీద దొరికే ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు తిని, జీర్ణ సంబంధమైన వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నాయని చెప్పారు. జంతువులను రోడ్ల మీద విడిచిపెట్టకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే పాలు అధిక ఉత్పత్తి కోసం హార్మోన్ సంబంధ ఇంజక్షన్లు ఇస్తున్నారని, ఇది శ్రేయస్కరం కాదన్నారు. పక్షుల ఆవాస స్థావరాలను ఇబ్బంది పెట్టకూడదని సూచించారు. తరువాత విద్యార్థులతో కైండ్‌నెస్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, ఎస్ఎస్ ఉపాధ్యాయిని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

30న మెగా రక్తదాన శిబిరం

పెదగంట్యాడ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని మహాత్మా మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షుడు జాగారపు శ్రీను తెలిపారు. ఈ మేరకు దళ్లివానిపాలెం జంక్షన్‌లో రక్తదాన శిబిరం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 29 రక్తదాన శిబిరాలు నిర్వహించామని, సుమారు పది వేల మందికి పైగా రక్తం అందజేశామని చెప్పారు. ఈ నెల 30న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధం సాయి, జాగారపు జాజిబాబు, సునీల్ రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.